క్లుప్తంగా

ఘనంగా శ్రీనూకాలమ్మ తల్లి పరస


అలంకరణలో నూకాలమ్మ

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవాని పాలెంలో గల శ్రీ నూకాలమ్మ తల్లి పరస మహోత్సవం మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కాలనీ పరిసర ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. నేలవేషాలు, సాముగరిడీ, భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని, వీధులను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. రాత్రి బుర్రకథ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ ప్రెసిడెంట్ గుడ్ల కాటరాజు రెడ్డి, కార్యదర్శి కారపు రెడ్డి శ్యామ్‌రెడ్డి, కోశాధికారి ధర్మాల గురుమూర్తి రెడ్డి, కార్యవర్గ సభ్యులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

సాయినాథుడికి పంచామృతాభిషేకం


ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

మురళీనగర్ : మురళీనగర్ రామాలయంలోని షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం 19వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, సనపల వరప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించిన ఉత్సవాల్లో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయినాథుడికి అర్చకుడు గోపి పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు సాయినామ జపం చేశారు.

అప్పన్న అన్నదానానికి రూ.లక్ష విరాళం


దాతకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎస్ జీజీవోస్ కాలనీ దరి శాంతిపురానికి చెందిన కలిదిండి హేమసాయి రమణ లక్ష్మి అనే దాత రూ.లక్ష 1,116 విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరపున అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ సునీల్ దాతకు బాండ్ ఇచ్చారు. అనంతరం స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఆలయ అధికారులు అందించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతంపేట : సంఘం ఆఫీస్ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల్లో భాగంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంఘం ఆఫీస్, జగన్నాథపురం, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, దాలిరాజు సూపర్ మార్కెట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

3న అక్షరాభ్యాసాలు

సీతంపేట : వసంత పంచమి సందర్భంగా ఫిబ్రవరి 3న ఉదయం 8 గంటల నుంచి అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. అక్షరాభ్యాసం చేయించదలచిన వారు పీఠం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే అమావాస్య సందర్భంగా బుధవారం ప్రత్యంగిర భద్రకాళి హోమం, మాఘమాసం శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు రాజశ్యామల నవరాత్రులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రోజూ ఉదయం 9 గంటలకు మణిద్వీపంలో సహస్రనామార్చన నిర్వహిస్తామని తెలిపారు.

బాలిక అపహరణపై కేసు

సీతమ్మధార : బాలికను అపహరించిన వ్యక్తిని ద్వారకా జోన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీతంపేట సమీప శాంతిపురం ప్రాంతానికి చెందిన హర్షవర్ధన్ (20) అదే ప్రాంతానికి చెందిన బాలికను అపహరించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు యువకుడి ఆచూకీ తెలుసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ డి.వి.రమణ తెలిపారు.

నిర్లక్ష్యం ఖరీదు రూ.23 కోట్లు


సుమారు రూ.23 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలం

- జీవీఎంసీ 49వ వార్డులో బర్మా క్యాంపు వద్ద నిరుపయోగంగా 65 సెంట్ల స్థలం
- ఆక్రమణల పాలవుతున్నా పట్టించుకోని అధికారులు
- కల్యాణ మండపం నిర్మించాలని స్థానికుల డిమాండ్


తుప్పలతో అపరిశుభ్రంగా తయారైన స్థలం


ప్రభుత్వ స్థలం ప్రహరీకి ఏర్పాటు చేసిన గేటు


ఇరుగ్గా మారిన పట్టాభిరెడ్డితోట నుంచి స్థలానికి అనుబంధ రహదారి

మురళీనగర్ : నగరంలో ఏది ప్రభుత్వ స్థలమో, ఏది ప్రైవేటు స్థలమో తెలియని పరిస్థితి నెలకొంది. ఎక్కడబడితే అక్కడ నిర్మాణాలు జరిగిపోతున్నాయి. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఖాళీ స్థలాలు దొరికితే చాలు వాటిని ఎలా కైవసం చేసుకోవాలో ప్రణాళికలతో సిద్ధమైపోతున్నారు. ప్రభుత్వ స్థలాలకు అనుబంధంగా ఉండే ప్రైవేటు స్థలాలు తీసుకుని భవన నిర్మాణ సమయంలో ఎంత వీలైతే అంత ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేపట్టేస్తున్నారు. ఆక్రమణదారులు రెచ్చిపోతున్నా బర్మా క్యాంపులోని కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని మాత్రం అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. జీవీఎంసీ 49వ వార్డులోని బర్మా క్యాంపులో బర్మా కాందిశీకులకు ఆశ్రయం కల్పించి ఇళ్లు నిర్మించిన సమయంలో వారికి ఉపయోగపడే విధంగా సామాజిక ప్రయోజనాల కోసం 65 సెంట్లు స్థలం వదిలేశారు. దీని ప్రస్తుత విలువ రూ.23 కోట్లు ఉంటుందని అంచనా. ఈ కాలనీలో సుమారు 400 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఒక వైపు అల్లూరి సీతారామరాజు నగర్ ఉంది. ఈ స్థలాన్ని ఇతర ప్రాంతాల వారు గతంలో ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రయత్నించినప్పుడు స్థానికుల ఫిర్యాదుతో అధికారులు అడ్డుకున్నారు. అనంతరం స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి గేటు ఏర్పాటు చేశారు. ఆ గేటు పూర్తిగా పాడవడంతో సాక్షిలో ప్రచురించిన కథనానికి స్పందించి అధికారులు కొత్త గేటు ఏర్పాటు చేశారు.


ఆక్రమణకు గురైన ప్రాంతం

గోడ విరగ్గొట్టి అక్రమ నిర్మాణం


ప్రహరీ గోడను దాటుకుని తవ్వకాలు జరుపుతున్న ప్రాంతం (పాత చిత్రం)

65 సెంట్ల ప్రభుత్వ స్థలం చుట్టూ చాలా నిర్మాణాలు ఉన్నాయి. ప్రస్తుతం ఒక ప్రైవేటు వ్యక్తి ప్రహరీ గోడ విరగ్గొట్టి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీనిపై స్థానిక బర్మా క్యాంపు అయ్యప్ప నివాసితుల సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. అయినా దీనిపై సరైన చర్యలు తీసుకోలేదు. ఇలాగే వదిలేస్తే స్థలం మొత్తం కబ్జాకు గురవుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనికి మరొక వైపు సామాజిక మరుగు దొడ్లు ఉన్నాయి. ఇందులోకి ప్రవేశించాల్సిన రహదారి ప్రాంతం ఇప్పటికే ఆక్రమణల పాలై ఇరుగ్గా తయారయ్యింది. అటు పట్టాభిరెడ్డి తోట, మాణిక్యాంబ కాలనీ, రజక కాలనీలు ఉన్నాయి. దీని చుట్టూ ఉన్న కాల్వలో పూడికలు సకాలంలో తొలగించకపోవడం వల్ల దుర్వాసన వ్యాపిస్తోంది. దోమలు వ్యాప్తి చెంది స్థానికులు జ్వరాల పాలవుతున్నారు. గతంలో దీన్ని పార్కు నిర్మాణం కోసం కేటాయించినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే దీని చుట్టూ నాలుగు కాలనీలతోపాటు అనేక అపార్టుమెంట్లు వెలిశాయి. సుమారు 5 వేల జనాభా నివసిస్తున్నారు. వారందరికీ ఉపయోగపడే విధంగా కల్యాణ మండపం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

రెండు దశాబ్దాలుగా పోరాటం



2005 నుంచి ఈ స్థలం రక్షణకు చర్యలు తీసుకోవాలని పోరాటం చేస్తూనే ఉన్నాం. అప్పట్లో మున్సిపల్ కార్పొరేషన్ నుంచి సిటీ ప్లానర్‌తోపాటు అసిస్టెంట్ ఇంజినీరు ఈ స్థలాన్ని పరిశీలించి సర్వే చేసిన మేరకు ఖాళీ ప్రదేశాన్ని సంరక్షించాలని సూచించారు. దీని ప్రకారం ప్రహరీ నిర్మించారు. ఆ తర్వాత దీన్ని పలువురు ఆక్రమించడానికి చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నాం. ఇటీవల ఓ వ్యక్తి గోడను కూల్చి లోపలికి ప్రవేశించి భవన నిర్మాణం చేపడుతున్నారు. దీనిపై జీవీఎంసీ కమిషనర్‌కు గ్రీవెన్స్‌లో ఈ నెల 23న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇటీవల వార్డు సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ వచ్చి పరిశీలించి వెళ్లినా నిర్మాణ పనులు ఆగలేదు.

– పి.శ్రీనివాసరావు, కార్యదర్శి,
బర్మా క్యాంపు అయ్యప్ప నివాసితుల సంక్షేమ సేవా సంఘం

మొక్కుబడిగా అధికారుల సర్వే



ఈ స్థలంలో బర్మాకాలనీ పరిసర ప్రాంత ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా కల్యాణ మండపం, లైబ్రరీ, పార్కు నిర్మించాలి. ఆక్రమణలపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. మొక్కుబడిగా సర్వే చేస్తున్నారు తప్ప తర్వాత పట్టించుకోవడం లేదు. ఇటీవల ఫిర్యాదు చేస్తే సచివాలయం అధికారి వచ్చి పరిశీలించి వెళ్లారు తప్ప చర్యలు తీసుకోలేదు. జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా అధికారులు వచ్చి చూసి వెళ్లిపోతున్నారు తప్ప అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడం లేదు. ప్రభుత్వ స్థలం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవడం లేదు. దీని గేట్లు పూర్తిగా విరిగిపోయాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడింది. స్థలం పరిరక్షణకు శాశ్వత చర్యలు చేపట్టాలి.

– డి.భాస్కరరావు, అధ్యక్షుడు,
బర్మా క్యాంపు అయ్యప్ప నివాసితుల సంక్షేమ సేవా సంఘం

ప్రమాదకరంగా వేలాడుతున్న లైటు


ఓ ఇంటి ముందు వేలాడుతున్న వీధిలైటు

మద్రిపాలెం : జీవీఎంసీ 50వ వార్డు మాధవధార జంక్షన్ 48వ నంబరు బస్టాప్ సమీపంలో ఓ ఇంటి ముందు వీధిలైటు ప్రమాదకరంగా వేలాడుతూ వెలుగుతోంది. కొంత కాలంగా అలాగే వేలాడుతూ వెలుగుతోందని, పలుమార్లు చెప్పినా అధికారులు పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదాలు చెప్పిరావని, అంతవరకూ వేలాడుతున్న లైటు కిందపడితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే ఈ ప్రాంతంలో చాలా చోట్ల పగలు కూడా వీధి దీపాలు వెలుగుతూనే ఉంటున్నాయని, అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వీధిలైట్లు వెలగక అంధకారం


బర్మా క్యాంపు వద్ద వెలగని వీధిలైట్లు

మురళీనగర్ : జీవీఎంసీ 49వ వార్డు బర్మా క్యాంపు పరిసరాల్లో వీధిలైట్లు వెలగడం లేదు. ముఖ్యంగా బర్మా క్యాంపు అయ్యప్ప సంక్షేమ సేవా సంఘం రహదారిలో ఏర్పాటు చేసిన హైమాస్టు లైట్లు వెలగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చీకట్లో కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో చిన్నారులు, వాహన చోదకులు గాయాలపాలవుతున్నారు. గత మూడు నెలల నుంచి లైట్లు వెలగలేదన్న విషయాన్ని సంబంధిత అధికారులకు తెలిపినా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యానగర్ నుంచి పట్టాభిరెడ్డితోట రహదారిని అనుకుని ఏర్పాటు చేసిన లైట్లు చెట్ల కొమ్మల్లో దాగి ఉండడం వల్ల అవి వెలిగినా ఉపయోగం ఉండడం లేదు. చెట్ల కొమ్మలు తొలగించి లైట్ల వెలుగులు రహదారిపై ప్రసరించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు


వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగహన కల్పిస్తున్న ద్వారకా జోన్ పోలీసులు

సీతమ్మధార : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ద్వారకా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రతాప్ సూచించారు. గురుద్వార జంక్షన్‌లో హెల్మెట్ లేకుండా రాకపోకలు సాగిస్తున్న వారికి మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిబుల్ రైడింగ్, రాంగ్‌రూట్ ప్రయాణం చేయరాదని సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. కారు డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ముందు సీటులో కూర్చునేవారు విధిగా సీటు బెల్టు పెట్టుకోవాలని తెలిపారు. వాహనాలు నడిపే సమయంలో ఫోన్లలో మాట్లాడరాదని స్పష్టం చేశారు. రోడ్డు దాటే పాదచారులు ఫోన్లలో మాట్లాడడం చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. రెడ్‌సిగ్నల్ జంపింగ్ చేసి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని కోరారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు చాలా మంది ఆర్టీసీ సిటీ బస్‌ల ఫుట్‌పాత్‌ల మీద వేలాడుతూ ప్రమాదభరితంగా ప్రయాణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బస్సు లోపల ఖాళీగా ఉన్నా సరే ఫుట్‌పాత్‌ల మీద వేలాడుతూ వెళ్తున్నారని... ఇలాంటి ప్రయాణం చాలా ప్రమాదకరమన్నారు. మత్తు పదార్థాలు, గంజాయికి బానిసలైతే జీవితాలు నాశనమవుతాయని, చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.

నిరుపయోగంగా ప్రజా మరుగుదొడ్లు


నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో ప్రారంభించని ప్రజా మరుగుదొడ్లు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో ప్రజా మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసినా ఉపయోగం లేకుండా దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. స్థానిక ప్రజల కోసం ఏర్పాటు చేసిన మురుగుదొడ్లు ఇప్పటి వరకు ప్రారంభించకుండా తాళాలు వేయడంతో వాటర్ ట్యాంక్ పాడైపోవడంతోపాటు రేకులు తుప్పు పడుతున్నాయి. పది మందికి ఉపయోగపడాల్సిన మురుగుదొడ్లు దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి. స్థానికులు మురుగుదొడ్ల వద్దకు వెళ్లే సరికి తాళాలు వేసి ఉండడంతో వెనుదిరుగుతున్నారు. వెంటనే వాటిని ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు


నేతాజీ ఫ్లైఓవర్ వంతెన నుంచి జ్ఞానాపురం వెళ్లే రహదారిలో వాహనాలు


స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా దూసుకొస్తున్న వాహనాలు

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం నేతాజీ వంతెన కూడలి నుంచి అటు ఊర్వశి కూడలి, ఇటు జ్ఞానాపురం, తాటిచెట్లపాలెం వైపు వచ్చే రహదారిలో స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నేతాజీ విగ్రహం నుంచి ముత్యమాంబ ఆలయం వద్ద మలుపులో సుమారు 200 అడుగులకు పైగా బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరించారు. కూడలి రహదారి వెంబడి గంటకు పది వేలకు పైగా వివిధ రకాల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డు విశాలం కావడంతోపాటు కూడలిలో బీఆర్‌టీఎస్ కారిడార్లు లేకపోవడం, నిత్యం కంచరపాలెం ట్రాఫిక్ సిబ్బంది వాహనాల తనిఖీలు నిర్వహించడంతో వాహనదారులు వేగంగా నడుపుతూ పాదచారులపైకి దూసుకొస్తున్నారని పలువురు వాపోతున్నారు. కూడలికి సమీపంలో ఆర్పీపేట, కంచరపాలెం, కె.కాలనీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. మితిమీరిన వేగంతో వాహనాలు రావడంతో విద్యార్థులు రోడ్డు దాటేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ కూడలి వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు, పాదచారులు, స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ఆక్రమించి బడ్డీల ఏర్పాటు



నరసింహనగర్ సర్వీస్ రోడ్డులో అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీలు

సీతంపేట : ప్రధాన రహదారుల వెంబడి బడ్డీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వీటికి ఎవరు అనుమతులిస్తున్నారో తెలియడం లేదు. పదుల సంఖ్యలో రహదారుల పక్కన బడ్డీలు వెలుస్తున్నా ఇటు టౌన్‌ప్లానింగ్ అధికారులు, అటు ట్రాఫిక్ పోలీసులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ప్రధాన రహదారుల ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. జాతీయ రహదారికి అనుకుని ఉన్న నరసింహనగర్ రైతు బజారుకు వెళ్లే సర్వీస్ రోడ్‌లో పదుల సంఖ్యలో బడ్డీలు ఇటీవల అక్రమంగా ఏర్పాటు చేశారు. కొద్ది నెలల కిందట రెండు మూడు బడ్డీలు మాత్రమే ఈ మార్గంలో ఉండేవి. ప్రస్తుతం ఈ మార్గంలో రహదారిని ఆక్రమించి 20 వరకు బడ్డీలు ఏర్పాటు చేశారు. కొంత మంది బడ్డీలు ఏర్పాటు చేసి అద్దెకు ఇస్తున్నట్టు సమాచారం. అలాగే బడ్డీలు ఏర్పాటు చేసుకోవడానికి నెలవారీ వసూళ్లు జరుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బడ్డీలు సుమారు 5 అడుగుల పైనే రహదారిని అక్రమించగా, అక్కడకి వచ్చే వినియోగదారుల వాహనాల పార్కింగ్‌తో రహదారి మరింత అక్రమణకు గురవుతోంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి ఆక్రమణలు తొలగించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

బాబోయ్ ట్రెజరీ కార్యాలయం

శిథిలావస్థకు చేరడంతో భయాందోళనలు


శిథిలమైన షెడ్లలో విధులు నిర్వహిస్తున్న ట్రెజరీ సిబ్బంది


రేకుల షెడ్ల మీద పేరుకుపోయిన చెట్ల కొమ్మలు, ఆకులు

సీతమ్మధార : స్థానిక తహసీల్దార్ ఆఫీస్ ఆవరణలో గల జిల్లా ఖజానా కార్యాలయం శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కొన్ని దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన కార్యాలయం ఇప్పటికే శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికీ ఇక్కడ రేకుల షెడ్లు కిందనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సుమారు 30 ఏళ్ల క్రితం ఈ కార్యాలయం ఏర్పాటు చేశారు. ముఖ్యమైన రికార్డులు ఇక్కడే భద్రపరుస్తారు. ఈ కార్యాలయంలో జిల్లా ట్రెజరీ ఆఫీసర్ పర్యవేక్షణలో మొత్తం 12 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. భద్రత కోసం రిజర్వ్ పోలీసులు కూడా రెండు షిఫ్టుల విధానంలో ఇక్కడే పనిచేస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యమున్న కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ శాఖల పింఛన్‌దారుల రికార్డులు ఇక్కడే ఉన్నాయి. వర్షాలు కురిసే సమయంలో రేకుల షెడ్లు కారిపోతున్నాయని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, కంప్యూటర్లు వర్షానికి తడిసి పోతున్నాయని గుబులు చెందుతున్నారు. రేకుల షెడ్ల మీద అధిక సంఖ్యలో చెట్ల కొమ్మలు పేరుకుపోయినా తొలగించే నాథుడే కరువయ్యాడు. నిత్యం పలు పనుల మీద అధిక సంఖ్యలో పింఛన్‌దారులు ఇక్కడికి వస్తుంటారు. దురదృష్టవశాత్తూ అనుకోని సంఘటన జరగకముందే కార్యాలయానికి మరమ్మతులు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు మోదీ ప్రభుత్వం కుయుక్తులు


నిరసన తెలుపుతున్న సీఐటీయూ జగదాంబ జోన్ కార్యకర్తలు

సీతమ్మధార: విశాఖ ఉక్కు పరిరక్షణకు కార్మిక, కర్షక, ప్రజా సంఘాలు చేస్తున్న పోరాటాల ధాటిని తట్టుకోలేక మోదీ ప్రభుత్వం దొడ్డి దారిన ప్రైవేటీకరణ అజెండాను అమలు చేసే ప్రయత్నం చేస్తుందని సీఐటీయూ నాయకుడు సంతోష్ అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న ఉక్కు పరిరక్షణ దీక్షలో సీఐటీయూ జగదాంబ జోన్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడారు. నాలుగు సంవత్సరాలుగా మొదట ప్లాంట్ నష్టాల్లో ఉందని, ఆ తర్వాత ప్లాంట్ అమ్మకానికి నష్టాలతో నిమిత్తం లేదని నిస్సిగ్గుగా మోదీ ప్రభుత్వం ప్రకటించడం దారుణమన్నారు. ప్లాంట్ మనుగడకి కావలసిన ముడి సరుకు ఆపేయడం, కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం, వీఆర్‌ఎస్ ప్రకటించడం వంటి కుయుక్తులతో కార్మికులను భయాందోళనలకు గురి చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. ఇటువంటి తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కి సొంత గనులు కేటాయించాలని, ప్లాంట్‌ని సెయిల్‌లో విలీనం చేయాలని, బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు వై. రాజు, ప్రొఫెసర్ సూరప్పుడు, సంజయ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

'తండేల్' యూనిట్‌కు భారీ బందోబస్తు


రామాటాకీస్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది

సీతంపేట : నాగ చైతన్య, సాయిపల్లవి హీరో హీరోయిన్లుగా గీతా ఆర్ట్స్ నిర్మించిన తండేల్ చిత్రం ట్రైలర్ లాంచ్ కార్యక్రమం స్థానిక రామాటాకీస్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. అభిమాన హీరో నాగచైతన్య ట్రైలర్ లాంచ్‌కు రావడంతో అక్కినేని అభిమానులు పెద్ద సంఖ్యలో థియేటర్‌కు చేరుకున్నారు. ట్రైలర్ లాంచ్ కార్యక్రమానికి వచ్చిన అభిమానులతో థియేటర్ హౌస్‌ఫుల్ అయ్యింది. అవాంఛనీయ సంఘటనలు సంభవించకుండా ద్వారకా జోన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి పర్యవేక్షణలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. థియేటర్ వద్ద పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించారు.